ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



5 సిద్దిపేట
సోమవారం 8 జూలై 2024

బస్టాండ్ నిర్మాణం పూర్తయ్యేనా?
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మలమూత్ర విసర్జనకు తప్పని తిప్పలు
- బిల్లులు మంజూరై, నిర్మాణం పూర్తయితేనే శాశ్వత పరిష్కారం

8వ

సామూహిక సూర్య నమస్కారం



కోమటిచెరువుపై యోగా సాధన

సిద్దిపేట క్రైం, జూలై 7 : వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో పట్టణంలోని కోమటిచెరువు రూబీ నెక్లెస్ ఆవరణలో ఆదివారం సూర్య నమస్కారాల సాధన జరిగింది. ప్రముఖ యోగా గురువు, నేషనల్ మెడలిస్టు తోట సతీష్ నేతృత్వంలో సామూహికంగా 108 యోగా సూర్య నమస్కారాలను చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె.అంజయ్య మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సాధనతో అధిక బరువు, నిద్రలేమి, అజీర్ణం, మలబద్ధకం వంటి అనారోగ్యాలు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో యోగ శిక్షకులు తోట సంధ్య, గంగాపురం శ్రీనివాస్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, పతంజలి యోగ ప్రబారి సురేష్, సాధకులు పాల్గొన్నారు.

త్వరలో ఓడీఎఫ్‌ను సందర్శిస్తా

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- సమస్యలపై ఎంపీకి ఉద్యోగుల వినతి



ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఓఎఫ్ఎంఎస్ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూలై 7 : త్వరలో ఓడీఎఫ్‌ను సందర్శిస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మజ్దూర్ సంఘ్(ఓఎఫ్ఎంఎస్)ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆదివారం హైదరాబాద్‌లో ఎంపీ రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి వర్క్‌లోడ్ షార్టేజ్, ఇతరత్ర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ రఘునందన్‌రావు ఫ్యాక్టరీకి వచ్చి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో యూనియన్ నాయకులు, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో ముగిసిన బీఆర్ఎస్ ప్రస్థానం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

గజ్వేల్, జూలై 7: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రస్థానం ముగిసిందని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన త్యాగమూర్తులను బీఆర్ఎస్ విస్మరించిందని, కేసీఆర్‌ను నమ్మి రెండుసార్లు అధికారమిస్తే ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కుటుంబపాలన కొనసాగిస్తున్న కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేకుండా చేశారని, బీజేపీపై నమ్మకంతోనే పార్లమెంటు ఎన్నికల్లో రఘునందన్‌రావుకు అన్ని వర్గాల ప్రజలు భారీగా ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. రాబోయే రోజుల్లో జరిగే అన్ని ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 9న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో కృతజ్ఞతసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మాదాడి జస్వంత్‌రెడ్డి, కొత్తూరు సురేష్‌గౌడ్, యెల్లు రాంరెడ్డి, టేకులపల్లి రాంరెడ్డి, గురువారెడ్డి, వెంకటరమణ, కొన్నె రాజిరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కూడిక్యాల రాములు, మైనార్టీ నాయకులు ఎండీ ఇక్బాల్, బీజేపీ పట్టణ, మండలాల అధ్యక్షులు దేవులపల్లి మనోహర్‌యాదవ్, పంజాల అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ బదిలీలపై కసరత్తు



జాబితా సిద్ధం చేస్తున్న ఉన్నతాధికారులు

- నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ట్రాన్స్‌ఫర్ తప్పనిసరి
- రెండేళ్ల సర్వీస్ పూర్తయితే దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి
- జిల్లాలోనే ఉండడానికి పైరవీలకు తెరలేపిన కొందరు అధికారులు
- స్థానిక రాజకీయ నాయకుల వెంట చక్కర్లు కొడుతూ ప్రయత్నం

సిద్దిపేట క్రైం, జూలై 7 : నెల రోజుల పాటు కొనసాగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగియగానే ప్రభుత్వం సాధారణ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఒకే చోట దీర్ఘకాలంగా పనిచేస్తున్న జిల్లా అధికారులు, కిందిస్థాయి అధికారులు, ఉద్యోగుల బదిలీ ప్రక్రియకు కసరత్తును ప్రారంభించారు. అయితే, జిల్లాలో ఒకే చోట నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించారు. ప్రతి కేడర్‌లోనూ 40 శాతం మించి బదిలీలకు అనుమతించరు. గతంలో సాధారణ బదిలీలు, ఎన్నికల సమయంలో ప్రత్యేక బదిలీలు చేపట్టినప్పటికీ కొంతమంది అధికారులు తమ పరపతితో జిల్లాలోనే తిష్ట వేశారు. కొందరు జిల్లా ఏర్పడినప్పటి నుంచి సిద్దిపేటలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని వారి స్థానాల్లో కదలకుండా కొనసాగుతున్నారు. ప్రస్తుతం బదిలీల నోటిఫికేషన్ రావడంతో మళ్లీ జిల్లాలోనే పనిచేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. మరికొంతమంది స్థానచలనం కోసం ఎదురుచూస్తుండగా ఈ బదిలీ ప్రక్రియతో వారికి ఊరట లభించనుంది. విధి నిర్వహణ కోసం తమ ప్రాంతాల నుంచి దూరంగా వచ్చిన వారు, ఎన్నికల సమయంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన అధికారులు తిరిగి జిల్లాకు వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

నాలుగు స్థాయిల్లో బదిలీలు


సాధారణ బదిలీలు నాలుగు స్థాయిల్లో జరగనున్నాయి. వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు సివిల్ సర్జన్లు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆ స్థాయి అధికారులు రాష్ట్ర స్థాయిలో బదిలీ కానున్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, వ్యవసాయాధికారులు, ఏఈఈలు, ఎస్‌డబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, ఏటీవోలు, మునిసిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ సివిల్ సర్జన్లతో పాటు ఆ స్థాయి కలిగిన అధికారులకు మల్టీజోన్-1 పరిధిలో బదిలీ జరగనుంది. మల్టీజోన్-1 పరిధిలోని బాసర, కాళేశ్వరం, భద్రాద్రి, రాజన్న జోన్‌లలోని జిల్లాల పరిధిలో ఉన్న ఖాళీలు, సీనియారిటీ ఆధారంగా ట్రాన్స్‌ఫర్‌లు కొనసాగుతాయి. జోనల్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు, వసతి గృహ సంక్షేమాధికారులు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, వెటర్నరీ అసిస్టెంట్లతో పాటు ఆ స్థాయి కలిగిన ఉద్యోగులకు రాజన్న జోన్ పరిధిలో బదిలీలు జరగనున్నాయి. కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా, మెదక్, సిద్దిపేట జిల్లాలో ఎక్కడికైనా బదిలీ జరిగే అవకాశం ఉంటుంది. అదే జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు తదితర ఉద్యోగులను జిల్లా స్థాయిలో బదిలీ చేయనున్నారు. జిల్లా స్థాయిలో బదిలీలు కలెక్టర్ నేతృత్వంలో కొనసాగుతాయి.

పదిహేను రోజుల్లో పూర్తి

జిల్లా స్థాయి ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కలెక్టరేట్ కేంద్రంగా కొనసాగనుంది. కలెక్టర్ చైర్మన్‌గా, ఆయా శాఖల అధికారులు కన్వీనర్లుగా వ్యవహరించనున్నారు. శాఖల అధికారులు రూపొందించే జాబితాల ఆధారంగా ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. కేడర్ల వారీగా కేటాయించిన పోస్టుల్లో ఎంత మంది పనిచేస్తున్నారు.. ఎన్ని ఖాళీగా ఉన్నాయి, పనిచేస్తున్న వారు కొనసాగుతున్న చోట ఎప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్నారనే వివరాలతో ఉద్యోగుల పూర్తి సమాచారంతో జాబితాలు సిద్ధం చేసే పనిలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. ముందుగా బదిలీ కావాల్సిన ఉద్యోగులు, ఖాళీల వివరాలను ప్రదర్శించనున్నారు. అనంతరం ఉద్యోగులు తాము బదిలీ కోరుకునే ప్రదేశాలకు వెబ్‌ఆప్షన్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. ఆయా శాఖల అధికారులు బదిలీ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, కౌన్సెలింగ్ నిర్వహించేందుకు జాబితా తయారు చేస్తారు. బదిలీ అయిన ఉద్యోగులకు ఉత్తర్వులు జారీ చేయనున్నారు. పదిహేను రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తికానున్నది. జిల్లాలో ప్రభుత్వ అజమాయిషీలో కొనసాగే శాఖలు 63 ఉన్నాయి. ఈ శాఖల్లో జిల్లా స్థాయి అధికారితో పాటు జోనల్, మల్టీ జోనల్, రాష్ట్ర స్థాయి విభాగాల పరిధిలోకి వచ్చే వివిధ హోదాల్లో అధికారులు, ఉద్యోగులు ఉంటారు. జిల్లాలో ఉపాధ్యాయులు, పోలీసులను మినహాయిస్తే మిగతా శాఖల్లో వివిధ హోదాల్లో రెండు వేల మందికిపైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో 40 శాతం మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. జిల్లా స్థాయి ఉద్యోగుల బదిలీలు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జరగనుండగా, జోనల్, మల్టీ జోనల్, రాష్ట్ర స్థాయి బదిలీలు హైదరాబాద్ వేదికగా ఆయా శాఖల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగనున్నాయి. కింది స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులను ఒక మండలం నుంచి మరో మండలానికి బదిలీ చేయనున్నారు. సొంత మండలంలో పనిచేయడానికి అవకాశం లేకపోవడంతో అలా ఉన్న వారిని వేరే మండలానికి బదిలీ చేస్తారు. మరికొంతమంది అధికారులను ఒక డివిజన్ నుంచి మరొక డివిజన్‌కు బదిలీ చేయనున్నారు.

జోరుగా పైరవీలు

జిల్లాలో కొంతమంది అధికారులు, ఉద్యోగులు సంవత్సరాల పాటు ఒకే దగ్గర పని చేస్తూ రాజకీయ నాయకులతో, ఉద్యోగ సంఘాల నాయకులతో సంబంధాలు ఏర్పరచుకొని తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఎన్నికల సమయంలో బదిలీలు వచ్చినప్పుడు వేరే చోటుకు డిప్యూటేషన్‌పై వెళ్లి ఎన్నికల తర్వాత తమ పరపతి ఉపయోగించుకొని యథాస్థానానికి వస్తున్నారు. మరి కొంతమంది అనారోగ్య సమస్యలను చూపెడుతూ జిల్లాను మాత్రం దాటడం లేదు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి బదిలీ తప్పనిసరి అనే నిబంధన పెట్టడంతో వారంతా మళ్లీ జిల్లాలోనే ఉండడానికి పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొంతమంది ఉద్యోగులకు పదోన్నతి వచ్చినా వదులుకుని అక్కడే కొనసాగుతున్నారు. ఉద్యోగులు అధికారిగా పదోన్నతి పొందిన తర్వాత క్యాడర్‌ను బట్టి జోన్ పరిధిలో లేదా మల్టిజోన్ పరిధిలో పనిచేయాల్సి ఉంటుంది. జిల్లా దాటి వెళ్లవస్తుందని పదోన్నతి పొందడానికి వెనుకడుగు వేస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆఫీసులలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు పదోన్నతిపై వేరే జిల్లాలోకి వెళ్లడానికి సిద్ధంగా లేరని తెలుస్తుంది. స్థానిక రాజకీయ నాయకులతో ఉన్న పరిచయాలను ఉపయోగించుకుని తమకు అనుకూలంగా, దగ్గరగా ఉండే ప్రాంతాల్లో ఉండదానికి ప్రయత్నిస్తున్నారు. కొన్ని శాఖల అధికారులు తమకు కావల్సిన ప్రాంతాలకు వేయించుకునేందుకు పైరవీలు చేస్తున్నారు. గతంలో కొంతమంది అధికారులకు దూర ప్రాంతాలకు బదిలీ ఆర్డర్లు వచ్చినప్పటికీ రిలీవ్ కాకుండా తమ పరపతితో కావాల్సిన చోటకు ఆర్డర్ తెచ్చుకున్నారు. అనారోగ్య సమస్యలను చెప్పి కొంతమంది, ఉద్యోగ సంఘాల పేర్లు చెప్పి మరి కొంతమంది జిల్లాను వదిలి వెళ్లకుండా ఉంటున్నారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ ఆఫీస్, ఇరిగేషన్, ఇంజనీరింగ్ శాఖల్లో కొంతమంది ఉద్యోగులు, అధికారులు చాలాకాలంగా జిల్లాలోనే ఉంటున్నారు.





గౌరవెల్లి ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

గండాలు దాటుతున్న గౌరవెల్లి

- ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతం
- నెలాఖరుకు కెనాల్ పనులు పూర్తి చేయాలని మంత్రి పొన్నం ఆదేశం
- ప్రస్తుతం ప్రాజెక్టులో ఒక టీఎంసీ నీరు

అక్కన్నపేట, జూలై 7 : అక్కన్నపేట మండలం గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి రిజర్వాయర్ అడుగడుగునా అడ్డంకులను ఎదుర్కొన్నది. ఉద్రిక్త పరిస్థితుల మధ్య పనులు కొనసాగినా రైతాంగానికి మాత్రం ఇంకా సాగునీరు అందించలేకపోయింది. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా దృష్టిసారించడంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే ప్రాజెక్టు కాలువలు పూర్తికి అధికారులతో మంత్రి సమీక్షలు నిర్వహించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉపాధిహామీ ద్వారా కాలువల జంగల్ కటింగ్‌ను పూర్తి చేశారు. మంత్రి చొరవతో ప్రాజెక్టు పూర్తికి నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం హుస్నాబాద్ సమీకృత కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించారు. నెలాఖరులోగా గ్రామాలకు సాగునీరు సరఫరా చేసే కాలువల పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో గౌరవెల్లి రిజర్వాయర్ గండాలు దాటుతున్నదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

95 శాతం పనులు పూర్తి

ఇప్పటికే గౌరవెల్లి ప్రాజెక్టు 95శాతంపైగా పనులను పూర్తి చేసుకుని అధికారులు ట్రయల్ రన్ చేసి గోదావరి జలాలను ప్రాజెక్టులోకి వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. 2007లో 1.43 టీఎంసీతో గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి సీఎం స్వర్గీయ వైయస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో సీఎం కేసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ సామర్థ్యాన్ని 8.24 టీఎంసీలకు పెంచుతూ రీడిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. భూనిర్వాసితులకు పరిహారం పెంచి ఇవ్వాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర డిమాండ్లపై ముంపు బాధితులు దశల వారీగా ఆందోళనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టి ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వం ఎలాగైనా ప్రాజెక్టును పూర్తిచేయాలని సంకల్పంతో భూ నిర్వాసితులు, ముంపు బాధితులతో చర్చలు జరిపి వారికి రావాల్సిన పరిహారాలను అందించింది. ఎన్నో అడ్డంకులు.. ఆందోళనలు.. లాఠీచార్జీలు.. పోలీస్ కేసులు.. అరెస్టులు.. జైలుశిక్షలు అనుభవించిన ముంపు బాధితులు శాంతించడంతో దశాబ్దాలుగా నీళ్ల కోసం ఎదురుచూస్తున్న మెట్టప్రాంతానికి గోదావరి జలాలు నీళ్లు వస్తాయని రైతులు ఆశ పడగా ఎన్జీటీ ఆదేశాలతో పిడుగు పడింది. దీంతో అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా పనులు నిలిపివేసింది. దీంతో రైతులు నిరుత్సాహం చెంది ఇక ప్రాజెక్టు పనులు పూర్తై సాగునీరు వస్తుందో లేదోననే ఆందోళనకు గురయ్యారు. ఇంతలో శాసనసభ ఎన్నికలు జరిగి హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, కేబినెట్‌లో రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పొన్నంకు అవకాశం దక్కడంతో ఆయన గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

కుళ్లిన కూరగాయలు, పాడైన సరుకులు
నాణ్యతకు తిలోదకాలు!

- అడ్డగోలుగా ఆహార కల్తీ.. కాలం చెల్లిన ఉత్పత్తుల వాడకం
- ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో వెలుగులోకి

సంగారెడ్డి అర్బన్, జూలై 7 : అడ్డగోలు ఆహార కల్తీ.. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా హోటళ్లు.. హాస్టల్ మెస్‌లు, బేకరీలు ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నాయి. ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఆకర్షణీయమైన హంగులతో కట్టిపడేసే హోటళ్లలో వాస్తవ పరిస్థితులు అధికారుల ఆకస్మిక తనిఖీల్లో బయటపడ్డాయి. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు ఏమాత్రం పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలున్నాయి. పాటించే ప్రమాణాలు మూడు కేటగిరీలుగా విభజిస్తారు. హానికరమైనవి, నకిలీవి, నాసికరమైనవి. ఇందులో ఏ ఒక్కటి పాటించకుంటే ఇక అంతే సంగతి. ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం ఆహార ప్రమాణాల సూచికలో తెలంగాణ 15వ స్థానంలో ఉందంటే నాణ్యతా ప్రమాణాల పరిస్థితి ఏ మేరకు ఉందో అంచనా వేసుకోక తప్పదు. నెల రోజులుగా సంగారెడ్డి జిల్లాలో జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారి ధర్మేందర్ నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలు అంశాలు వెలుగుచూశాయి. ఈ తనిఖీల్లో ఇప్పటి వరకు 14 నోటీసులు జారీ చేసినట్లు అధికారి తెలిపారు.

తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలు

- సంగారెడ్డి పట్టణంలో గత నెల 19న ఓ బావార్చి రెస్టారెంట్‌లో అపరిశుభ్రమైన కిచెన్, వెజ్, నాన్‌వెజ్ పదార్థాలు ఒకే ఫ్రీజర్‌లో నిల్వ చేశారు. కూరగాయలు కుళ్లిపోయాయి. బేకరీలో ఆహార పదార్థాలు అపరిశుభ్రంగా పడివుండడాన్ని గుర్తించారు. లేబుల్ లేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.



సంగారెడ్డి ఫసల్‌వాదిలో ఓ హాస్టల్‌లో వస్తువులను పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ధర్మేందర్

- ఓ ప్రముఖ బేకరీలో నిర్వహించిన తనిఖీల్లో గడువు ముగిసిన మష్రూమ్, స్ట్రాబెర్రీలను గుర్తించారు.
- గత నెల 20న ఫసల్‌వాది శివారులోని ఎంఎన్ఆర్ విద్యాసంస్థ సమీపంలోని ప్రైవేట్ హాస్టళ్లు, మెస్‌లల్లో ఫుడ్‌సేఫ్టీ అధికార బృందం తనిఖీలు చేయగా మైదా పిండిలో లక్కపురుగులు, వంట గది అపరిశుభ్రం, కూరగాయలు నిల్వ చేసే ప్రదేశంలో సాలె పురుగులు, ఫంగస్ సోకిన ఉల్లిపాయలు, ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్ లేని కారణంగా నోటీసులు జారీచేశారు.
- 27న రుద్రారంలోని ఓ ప్రముఖ జూనియర్ కళాశాల క్యాంటిన్‌ను ఆకస్మిక తనిఖీ చేయగా 50 కిలోల ఇడ్లీ రవ్వ గడువు ముగియడాన్ని గుర్తించారు.
- 28వ తేదీన సుల్తాన్‌పూర్‌లోని ఓ విద్యాసంస్థ హాస్టల్‌ను ఎఫ్ఎస్ఎస్ఏఐ బృందం, ఫుడ్‌సేఫ్టీ ఫ్లయింగ్ స్క్వాడ్, మొబైల్ ప్రయోగశాల ద్వారా ఆకస్మిక తనిఖీలు చేపట్టగా స్టోర్‌రూమ్‌లో ఎలుకలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. కూరగాయలు కోసే ప్రాంతం అత్యంత అపరిశుభ్రంగా కంపు కొడుతున్నది. వాటర్ అనాలసిస్ రిపోర్టులు లేకపోవడం, ముడిసరుకులు నాసిరకంగా ఉండడాన్ని గమనించి నోటీసులు జారీ చేసి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు.
- ఈ నెల 1వ తేదీన ఫసల్‌వాది శివారులోని ఓ విద్యాసంస్థ మెస్‌లోనూ నిబంధనలు పాటించకపోవడంతో నోటీసులు జారీ చేసి పలు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

అసంపూర్తిగా పాఠశాలల అదనపు గదుల నిర్మాణం

- గత ప్రభుత్వంలో 'మన ఊరు-మనబడి' కింద పనులు
- బిల్లులు రాలేదని మధ్యలోనే ఆపిన కాంట్రాక్టర్లు
- పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల వేడుకోలు




నారాయణపూర్‌లో పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణం, మధ్యలోనే నిలిచిపోయిన మూత్రశాలల గదులు

నర్సాపూర్, జూలై 7: గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా 'మనఊరు-మనబడి' కింద పాఠశాలలకు నిధులు కేటాయించి పనులు చేపట్టింది. అయితే సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పాటు అధికారుల అలసత్వం కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్ ప్రాథమిక పాఠశాలలో సుమారు వందమంది వరకు విద్యార్థులు ఉంటారు. వారికి తగ్గట్టు గదులు లేకపోవడంతో గత ప్రభుత్వంలో రెండు అదనపు గదులతో పాటు మూత్రశాలల నిర్మాణం చేపట్టారు. మూత్రశాలల పనులు చివరిదశలో నిలిచిపోగా.. అదనపు తరగతి గదుల నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిపేశారు. అదేవిధంగా మండలంలోని ఎల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో కూడా రెండు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. పనులు చివరిదశలో నిలిపివేయడంతో అసంపూర్తిగా ఉండిపోయాయి. రూ.లక్షలు వెచ్చించిన పనులు మధ్యలోనే నిలిపేయడంతో ప్రజాధనం వృథా అవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సరైన గదులు లేకపోవడంతో ఇరుకు గదుల్లో విద్యార్థులు చదువుతూ అవస్థలు పడుతున్నారు.

అరకొర గదిలోనే పంచాయతీ కార్యాలయం!

ఎల్లాపూర్‌లో అదనపు గదుల నిర్మాణం పూర్తికాకపోవడంతో అరకొర గదుల్లో ఇబ్బందులు పడుతుంటే.. పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో పాఠశాలలోనే ఉన్న గదిని పంచాయతీ కార్యాలయంగా వాడుకుంటుండడం విశేషం. 'మనఊరు-మనబడి' కింద పాఠశాలలో అదనపు గదుల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని అధికారులు హడావుడి చేశారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా.. వాటి గురించి పట్టించుకునే నాథుడే లేడు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

తల్లి మరణం తట్టుకోలేక కొడుకు బలవన్మరణం



బాలమల్లు (ఫైల్)

మర్కుక్, జూలై 7: తల్లి మరణంతో మనోవేదనకు గురైన కొడుకు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మర్కుక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రవల్లి గ్రామానికి చెందిన మల్లని నర్సమ్మ(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మూడునెలల క్రితం చనిపోయింది. తల్లి మృతిని జీర్ణించుకోలేక మనోవేదనతో నర్సమ్మ కొడుకు బాలమల్లు(36) శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే గజ్వేల్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. తల్లి మల్లమ్మ మృతిని తట్టుకోలేకనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తన కొడుకు మరణంపై ఎటువంటి అనుమానం లేదని, బాలమల్లు తండ్రి నర్సయ్య ఫిర్యాదు చేసినట్లు మర్కుక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతుని స్వగ్రామం ఎర్రవల్లిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ మొండి భాగ్య భిక్షపతి, గ్రామ నాయకులు వెంకట్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, శ్రీశైలం బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దళితుల హక్కుల సాధనకు పోరాటాలు: కేవీపీఎస్

సంగారెడ్డి రూరల్, జూలై 7: పోరాటాల ద్వారానే దళితుల హక్కులను సాధిస్తామని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా దళితులపై పెద్దఎత్తున దాడులు జరుగుతూనే ఉన్నాయని, దాడులు చేస్తున్న వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దళితులకు రక్షణ చట్టాలుగా ఉన్నా అగ్రవర్ణ పెత్తందారులకే చుట్టాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ రక్షణ కోసం, రిజర్వేషన్ల అమలుకు, విద్యా వైద్యం కోసం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం భవిష్యత్తులో ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదన్నారు.



శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం



పటాన్‌చెరు మహంకాళీ ఆలయం వద్ద కార్యకర్తల పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

సమస్యల పరిష్కారానికి రాజీలేని కృషి

పటాన్‌చెరు, జూలై 7: మెదక్ జిల్లా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు. బీజేపీ యువ నాయకుడు రాచమల్ల సంతోష్‌గౌడ్ నేతృత్వంలో 11 మంది బీజేపీ కార్యకర్తలు రఘునందన్‌రావు విజయానికి మొక్కులు తీర్చుకోవడంలో భాగంగా ఆదివారం పటాన్‌చెరు మహంకాళీ అమ్మవారి ఆలయం నుంచి విజయవాడ కనకదుర్గ ఆలయం వరకు చేపడుతున్న పాదయాత్రను ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. పటాన్‌చెరు నియోజకవర్గ సమస్యలతో పాటు మెదక్ జిల్లా సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మహంకాళీ ఆలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ సపానాదేవ్, నాయకులు ప్రకాష్‌రావు తదితరులు ఘనంగా సన్మానించి, అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

నేటి నుంచి తారా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 7: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేటి నుంచి డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. దోస్త్ మూడో ఫేస్‌లో అడ్మిషన్లు వచ్చిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకుంటే వారి సీటు ఉంటుందన్నారు. మూడో ఫేస్‌లో అడ్మిషన్ వచ్చినవారు 11వరకు మొదట సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని సూచించారు. మొదట, రెండో, మూడో ఫేస్‌లో సీటు వచ్చి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకున్న విద్యార్థులు సీసీఈ ఓటీపీ వచ్చిన తర్వాత 12 వరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొందాలని సూచించారు. ఇతర వివరాలకు 9989942298, 7989239115 నంబర్లకు ఫోన్ చేయాలని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ సూచించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట, జూలై 7: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొంతాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన అరికెల రమేష్ భార్య పుష్ప ఈనెల 6న ఉదయం 9 గంటలకు కూలీకి వెళ్లింది. భర్త రమేష్, కూతురు అక్షయ ఇంట్లోనే ఉన్నారు. కూలీ పనులను ముగించుకొని పుష్ప సాయంత్రం 7 గంటలకు ఇంటికి వచ్చింది. భర్త కనిపించకపోవడంతో కూతురు అక్షయను అడగ్గా బయటకు వెళ్లాడని చెప్పింది. రాత్రి 9 అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం ఉదయం 5 గంటలకు ఇంటి ఎదుట గుడిసెలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శివ్వంపేట, జూలై 7: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం చిన్నగొట్టిముక్కల గ్రామంలో చోటుచేసుకున్నది. శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కల గ్రామంలోని కుమ్మరివాని కుంట వద్ద పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహం కనిపించడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన తూప్రాన్ సీఐ రంగకృష్ణ, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 15 రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని, మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టని స్థితిలో ఉన్నదన్నారు. మృతుడి పాయింట్ జేబులో ఫోన్ లభించిందని, అయితే వర్షానికి తడిసిపోవడంతో సిమ్ పనిచేయడం లేదన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉన్నదని సీఐ తెలిపారు.

వర్షాల కోసం ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



మునిగేపల్లి పటేల్‌చెరువు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కల్హేర్, జూలై 7: వర్షాకాలం ప్రారంభమై నెలరోజులకు ఎక్కువ కావస్తున్నా.. వర్షాలు కురియకపోవడంతో ప్రజలు వరుణదేవుడు, తమ మతాలకు చెందిన దేవుళ్లపై ఆధారపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం మునిగేపల్లి గ్రామ శివారులోని పటేల్ చెరువు వద్ద గ్రామానికి చెందిన ముస్లింలు పేషిమామ్ సఫియొద్దీన్, మైనార్టీ మండల నాయకులు నవాబ్‌పటేల్ ఆధ్వర్యంలో వర్షాలు కురిపించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నమాజు చదివి వర్షాలు కురిపించి, రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలీమ్ సాబ్ అబ్దుల్ వాహబ్, ఎండీ ఇద్రీస్, ఇసాక్ పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్న పోలీసులను దూషించిన వైద్యులు

- ఓ జర్నలిస్టుపై దాడికి యత్నం

మెదక్ అర్బన్, జూలై 7: బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడమే కాక.. తాగొద్దన్నందుకు ఓ ఇద్దరు వైద్యులు పోలీసులను బండ బూతులు తిట్టారు. ఈ ఘటన ఆదివారం పట్టణంలోని గాంధీనగర్ శివారులో జరిగింది. సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన ఓ ప్రభుత్వ వైద్యుడు, మెదక్ ప్రాంతానికి చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఓ డాక్టర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి గాంధీనగర్ శివారులోని బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగొద్దని అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. మీ కానిస్టేబుళ్లతో మాట్లాడేది లేదని, పోలీసు అధికారులతోనే మాట్లాడుతామని, మాకు పెద్ద పెద్ద వాళ్లు తెలుసంటూ దూషించారు. అంతేకాకుండా పోలీసులతో వాగ్వాదం జరుగుతుండగా.. విషయం గమనించిన ఓ జర్నలిస్టు అక్కడికి వెళ్లగా అతనిని బైక్‌పై నుంచి లాగేశారు. వారిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

28 నుంచి ఉజ్జయిని మహంకాళీ జాతర

తూప్రాన్, జూలై 7: తూప్రాన్ పట్టణంలోని శ్రీఉజ్జయిని మహంకాళీ ఉత్సవాలు 28 నుంచి నిర్వహించడానికి పురప్రముఖులు నిర్ణయించారు. పట్టణంలోని ఉజ్జయిని మహంకాళీ ఆలయ ఆవరణలో ఆదివారం ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 28న బండ్లు, బోనాలు, 29న గావురంగాలు, 30న బొరమ్మ పూజలు నిర్వహించడానికి నిర్ణయించారు. ఉదయ్‌కుమార్‌శర్మ ఉత్సవాల తేదీలు ఖరారు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతికృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, పురప్రముఖులు పాల్గొన్నారు.

ఐలాపూర్ రైతులకు న్యాయం చేయాలి

- దశాబ్దాలుగా న్యాయపోరాటంతో చితికిపోయాం
- కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు కావడం లేదు
- న్యాయం చేయాలని బాధితుల ఆవేదన

పటాన్‌చెరు, జూలై 7: దశాబ్దాల తరబడి పోరాటం చేస్తున్నా న్యాయంగా దక్కాల్సిన తమ భూములు దక్కడం లేదని అమీన్‌పూర్ మండలం ఐలాపూర్, ఐలాపూర్ తండాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ఐలాపూర్ భూముల కథ నంపై గ్రామ భూ బాధితులు, రైతులు స్పందించారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా గ్రామంలోని మొత్తం భూమిని వివాదాస్పదం చేయడంతో మొత్తం 1263.21 ఎక రాల భూమి వివాదాస్పదమైంది. కాగా 1982లోనే సంగారెడ్డి జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు జాయింట్ కలెక్టర్ రైతుల పేరుమీద సేత్వార్ జారీచేశారని వారు తెలిపారు. అప్పటి నుంచి పహానీలలో తమ పేర్లు వస్తున్నాయని, పాసు పుస్త కాలు సైతం జారీ అయ్యాయని పేర్కొన్నారు. పట్టా రైతు లతో పాటు గతంలో ఆయా ప్రభుత్వాలు ఇచ్చిన అసైన్డ్ పట్టాదారులు సైతం తమ భూములను సాగుచేసుకునే అవ కాశం ఇవ్వకుండా కొందరు ప్రైవేటు వ్యక్తులు అడ్డుపడుతు న్నారని విమర్శించారు. దశాబ్దాల తరబడి భూములను సాగు చేసుకుంటున్న వారిని సైతం పట్టాదారులు కాదని ప్రచారం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఐలా పూర్, ఐలాపూర్ తండాల్లో ఉండే గిరిజన, బలహీనవర్గాలు, మైనార్టీల భూములను స్వాధీనం చేసుకునే కుట్రలు జరుగు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఐలాపూర్ భూ బాధితులు, రైతుల పక్షాన న్యాయపోరాటం చేస్తున్న గ్రామా నికి చెందిన రైతు ఎంఏ.ముఖీం మాట్లాడుతూ గతంలో రైతులను ఇబ్బందులకు గురిచేసేందుకు హైకోర్టులో 2005లో వేసిన 18845, 11993, 18793 రిట్ పిటిషన్లను సుదీర్ఘ విచారణల తరువాత న్యాయస్థానం కొట్టివేసిందని పేర్కొన్నారు. అయినా ఐలాపూర్ భూములపై కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దశాబ్దాల తరబడి రెండు గ్రామాల రైతులు, నిజమైన పట్టాదారులకు దక్కాల్సిన భూములను దక్కకుండా చేసేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను సాగనివ్వమన్నారు. తాజాగా సర్వే నెంబర్ 119లో 19.27 ఎకరాల భూమికి నిజమైన పట్టాదారు లుగా ఉన్న రైతులకు అనుకూలంగా ఎవరు ఉన్నా ఇబ్బందు లకు గురిచేయొద్దని ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. కోర్టు ఆదేశాలు సైతం లెక్కచేయకుండా కొందరు నాయ కులు, దళారుల ప్రోద్బలంతో రెవెన్యూ సిబ్బంది ఇబ్బందు లకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 1987లోనే సర్వేనం బర్ 119లో భూములను మార్పిడి చేసి రెసిడెన్షియల్ జోన్లుగా అప్పటి ప్రభుత్వమే మార్చిందన్నారు. పట్టా భూములుగా గుర్తించి భూ మార్పిడి చేసిన భూములు ఎలా వివాదాస్పదం అవుతాయని వారు ప్రశ్నించారు. ఈ తరహా చర్యలను గ్రామస్థులు ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. దశా బ్దాల తరబడి న్యాయం కోసం ఎదురు చూస్తున్నా ఏ ప్రభుత్వం న్యాయం చేయలేదని ఆరోపించారు.

సొంత నిధులతో మట్టి రోడ్డు నిర్మాణం

కుకునూరుపల్లి, జూలై 7: ప్రభుత్వాలు, అధికారుల గురించి ఆలోచించకుండా రైతులే స్వయంగా మట్టి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. కుకునూరుపల్లి, మంగోల్ గ్రామాలకు చెందిన రైతులు వారి పొలాల వద్దకు వెళ్లే దారి సరిగా లేక ఇబ్బందులకు గురయ్యేవారు. వర్షాకాలంలో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. రైతుల ఇబ్బందులను గమనించిన మంగోల్ మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి ఇరు గ్రామాల రైతులతో మాట్లాడి 30 ఫీట్ల మట్టి రోడ్డు నిర్మాణానికి ఒప్పిం చారు. దీనికి స్వచ్ఛందంగా రైతులు తమ భూములను రోడ్డు నిర్మాణానికి ఇచ్చారు. దాదాపు రెండు కిలోమీటర్ల వరకు రైతులు సొంత డబ్బులతో ఈ మట్టి రోడ్డును చేపట్టారు. భవిష్యత్తులో ఈ మట్టి రోడ్డు తారు రోడ్డుగా మార్చాలని ప్రభుత్వాన్ని రైతులు కోరారు.




సొంత నిధులతో మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టిన రైతులు

తెలంగాణలో సిద్దిపేట జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ఆదర్శంగా నిలిచింది. విద్యారంగంలో సైతం ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో విధంగా ఉపాధ్యాయుల ఆలోచనకు పదును పెట్టి విద్యార్థులను చదువుల్లో అభివృద్ధి పరుస్తున్నారు. కొత్త కొత్త విషయాలను విద్యార్థులకు అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

- కొండపాక, జూలై 7



సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్‌పల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల



ఎస్సీఈఆర్టీ రూపొందించిన మ్యాగజైన్ ఫ్రంట్ పేజీ

మ్యాగజైన్‌లో మన పాఠశాలలు

- 'హర్బింగర్స్ ఆఫ్ చేంజ్'లో పాఠశాలల విద్యారంగ కథనాలు
- సిద్దిపేట జిల్లాలోని నాలుగు పాఠశాలలకు చోటు

సిద్దిపేట జిల్లాకు చెందిన నాలుగు పాఠ శాలల విజయగాథలను ఎస్సీఈఆర్టీ రూపొందించిన 2023-24 సంవత్సర 'హర్బింగర్స్ ఆఫ్ చేంజ్' అనే మ్యాగజైన్‌లో ప్రచురించారు. ప్రతిఏటా పుస్తకాన్ని ఎస్సీఈ ఆర్టీ రూపొందిస్తుంది. ప్రస్తుత సంవత్స రంలో రూపొందించిన మ్యాగజైన్‌లో 55 పాఠశాలలకు సంబంధించిన కథనాలను పొందుపరచగా.. ఇందులో సిద్దిపేట జిల్లాకు చెందిన నాలుగు పాఠశాలల కథనాలను పొందుపరచడం విశేషం. ఎస్సీఈఆర్టీ స్కూల్ లీడర్‌షిప్ అకాడమీకి చెందిన సురేష్ ఏబాబు నేతృత్వంలో మధుసూదన్‌రెడ్డి, జగ దీశ్వర్‌రెడ్డి, వెంకటరమణమ్మల సహకా రంతో ఈ మ్యాగజైన్ వెలువడింది. సిద్దిపేట అర్బన్ మండలంలోని ప్రాథమికోన్నత పాఠ శాల నాంచార్‌పల్లి, చిన్నగుండవెల్లి ప్రాథ మిక పాఠశాల, దుబ్బాక మండలం లచ్చ పేట ప్రాథమిక పాఠశాల, దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ ప్రాథమిక పాఠశా లలకు చెందిన విజయగాథలను ఇందులో ప్రచురించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది.. పాఠశాలలో అమ లవుతున్న ప్రత్యేక కార్యక్రమాలతో పాటు.. విద్యార్థుల సంఖ్యను పెంచి పాఠశాల అభి వృద్ధికి కృషిచేసిన ఉపాధ్యాయుల సక్సెస్ స్టోరీలను అందులో ప్రచురించారు. మ్యాగ జైన్‌లో నాలుగు పాఠశాలలకు చెందిన కథ నాలు రావడంతో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, సెక్టోరియల్ అధికారులు బేతి భాస్కర్, రామస్వామి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు.



నాంచార్ పల్లి పాఠశాల సక్సెస్ స్టోరీ

సమష్టి కృషి ఫలితం



పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా సమష్టి కృషి ఫలితంగా మ్యాగజైన్లో చోటు లభించడం ఆనందం. ఏ పనినైనా కలిసి చేస్తే అభివృద్ధి సాధిస్తామనేదానికి ఇది ఒక గుర్తింపు. ప్రైవేటుకు దీటుగా విద్యార్థుల సంఖ్యను పెంచాం. తల్లిదండ్రుల భాగస్వామ్యం, గ్రామస్థుల సహకారంతో పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచాం.

- చీల రవి, ఉపాధ్యాయుడు యూపీఎస్, నాంచార్‌పల్లి, సిద్దిపేట అర్బన్ మండలం

మ్యాగజైన్‌లో చోటు దక్కడం ఆనందంగా ఉంది



ఎస్సీఈఆర్టీ ప్రచురించిన సంచికలో తనకు చోటు లభించడం ఎంతో ఆనం దాన్ని కలిగించింది. కష్టపడి పనిచేస్తే గుర్తింపు అదే వస్తది. పేద విద్యార్థులకు చదువు అందించడం, అంకితభావంతో పనిచేస్తే సమాజం గుర్తిస్తుంది.

- రాధాపద్మజ, ఉపాధ్యాయురాలు, చిన్న గుండవెల్లి, సిద్దిపేట రూరల్ మండలం

ఉపాధ్యాయుల కృషి ఫలితం

ఉపాధ్యాయుల కృషి ఫలితమే ఎస్సీఈఆర్టీ మ్యాగజైన్‌లో సక్సెస్ స్టోరీలు రావడం. వినూత్న పద్ధతుల్లో బోధన చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తయారు చేస్తున్న ఉపాధ్యాయుల అంకిత భావాన్ని గుర్తించడం, సిద్దిపేట జిల్లాలో నాలుగు పాఠ శాలలకు చోటు లభించడం హర్షణీయం.

- బేతి భాస్కర్, జిల్లా సెక్టోరియల్ అధికారి

అటవీ భూమిని దున్నిన 15 మందిపై కేసు



శివ్వంపేట మండలం సీతారాంతండాలో గిరిజనులు చదును చేసిన అటవీ భూమి

శివ్వంపేట, జూలై 7 : అటవీ చట్టాన్ని ఉల్లంఘించి చెట్లను నరికి అక్ర మంగా అటవీ భూమిని దున్నిన 15 మంది గిరిజనులపై కేసు నమోదు చేసి నట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి కిరణ్ తెలిపారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం సీతారాం తండాలో తూప్రాన్ రేంజ్ మంగళపర్తి సెక్షన్ పరిధిలోని 318 కంపాట్‌మెంట్‌లో, నర్సాపూర్ రేంజ్ పరిధిలోని శివ్వంపేట సెక్షన్ 319 కంపాట్‌మెంట్‌లో నాలుగు రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా సుమారు నాలుగు హెక్టార్లలో చెట్లను నరికారు. అక్రమంగా సుమారు ఎకరా 20 గుంటల అటవీ భూమిని డోజర్‌లతో దున్ని చదును చేసారు. చట్టాన్ని ఉల్లం ఘించిన సీతారాం తండాకు చెందిన మాలోత్ బద్రి, మాలోత్ పచ్య, మాలోత్ రమేష్, మాలోత్ కిషన్, కేతావత్ సామ్య, కాట్రోత్ దేప్య, కాట్రోత్ సాధు, కాట్రోత్ సరోజ, బుక్య హరిలాల్, మాలోత్ మంగ్య, మాలోత్ లక్ష్మి, మాలోత్ లాల్ సింగ్, మాలోత్ భాస్కర్, కాట్రోత్ శక్రు, మాలోత్ రవిపై అటవీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సెక్షన్ అధికారి కిరణ్ తెలిపారు.



గిరిజనులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు

'ఈడీ' పేరుతో బెదిరింపు

- బ్యాంకు వివరాలు అడిగి రూ.3 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

పటాన్‌చెరు, జూలై 7: 'నీపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదు అయింది. ఆధార్, బ్యాంకు వివరాలు చెప్పాలంటూ సైబర్ నేరగాళ్ల సరికొత్త ఎత్తుగడతో ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో చోటుచేసుకున్నది. బాధితుడు ఆదివారం పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అసలు మోసం వెలుగులోకి వచ్చింది. మండల పరిధి లోని లక్డారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి జూలై 1న అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ముంబై ఈడీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని నీపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదైందని బెదిరించాడు. ఆధార్, బ్యాంకు వివ రాలు తెలపాలని దబాయించాడు. బాధితుడు భయభ్రాంతులకు గురై పూర్తి వివరాలను చెప్పాడు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీ సైతం చెప్పడంతో ఖాతా నుంచి రూ.3లక్షలు మాయమయ్యాయి. రెండు రోజుల తరువాత బ్యాంకు వివరాలు తెలుసుకుని తాను మోసపోయానని గ్రహించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల పటాన్‌చెరు ప్రాంతంలో ఈడీ ఓ ప్రముఖ రాజ కీయ నాయకుడి ఇంటిపై దాడి చేయడాన్ని గమనించి సైబర్ నేరగాళ్లు ఈ సరికొత్త ఎత్తుగడతో ఆన్‌లైన్ సైబర్ నేరానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

పర్యావరణవేత్త కిషన్‌రావుకు జాతీయ అవార్డు



అవార్డుతో డాక్టర్ కిషన్‌రావు దంపతులు

పటాన్‌చెరు, జూలై 7: నాలుగు దశా బ్దాలుగా పటాన్‌చెరు పారిశ్రామికవాడ కాలుష్యంపై పోరాడిన ప్రముఖ పర్యావ రణవేత్త డాక్టర్ అల్లాణి కిషన్‌రావు సేవ లను కొనియాడుతూ క్యాపిటల్ ఫౌండే షన్ జాతీయ అవార్డును అందజేశారు. ఆదివారం శామీర్‌పేటలోని నల్సార్ విశ్వ విద్యాలయంలో దేశ అటార్నీ జనరల్ డాక్టర్.ఆర్.వెంకటరమణి, మంత్రి ఉత్తంకు మార్‌రెడ్డి నుంచి అవార్డును అందుకు న్నారు. పటాన్‌చెరులో ఐదు దశాబ్దాలుగా వైద్యుడుగా సేవలందిస్తూ పర్యావరణ ఉద్యమకారుడుగా కాలుష్య నియంత్ర ణపై అనేక పోరాటాలు చేశారు. ఆయన పటాన్‌చెరు, ఐడీఏ బొల్లారం, సుల్తా న్‌పూర్ కాలుష్యంపై ఆయన రాసిన ఏ హెల్ ఆన్ ది ఎర్త్ పుస్తకం సంచలనం రేకెత్తించింది. రసాయన పరిశ్రమల కాలుష్యానికి నక్కవాగు పరివాహ ప్రాంతంలోని అనేక గ్రామాలలో భూగర్భ జలాలు కలుషిత కావడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించి నష్టపరిహారం అందేలా కృషి చేశారు. ఆయన పోరాట ఫలితంగానే నక్కవాగుపై రసాయన ఉమ్మడి శుద్ధి కర్మాగారాన్ని ప్రభుత్వం నెలకొల్పింది. అవార్డు రావడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ పాలకుల ప్రథమ కర్తవ్యం కావాలన్నారు.



సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలో జగన్నాథ రథయాత్ర ఊరేగింపు ముందు కోలాటం ఆడుతున్న మహిళలు



జిన్నారం: పూరీ జగన్నాథస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న రథోత్సవంలో ఎంపీ రఘునందన్‌రావు


సంగారెడ్డిలో వైభవంగా జగన్నాథ రథయాత్ర

సంగారెడ్డి అర్బన్/జిన్నారం, జూలై 7: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) వారి ప్రచార కేంద్రం భక్తి యోగా సెంటర్ ఆధ్వ ర్యంలో సంగారెడ్డిలో జగన్నాథ రథయాత్రను ఆదివారం వైభవంగా నిర్వ హించారు. కొత్త బస్టాండ్ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు యాత్ర కొనసాగింది. అనంతరం పీఎస్ఆర్ గార్డెన్స్‌లో జగన్నాథ, బలదేవ సుభ ద్రలకు అలంకార సేవ, చప్పన్ భోగ నైవేద్య సమర్పణ, జగన్నాథ్ లీల లపై ప్రత్యేక ప్రవచనం, చిన్నారుల నృత్య ప్రదర్శనలు కనువిందుగా జరి గాయి. ఇస్కాన్ సీనియర్ భక్తులు శ్రీమాన్ ప్రేమ్‌నర్తన్ ప్రభుజీ మాట్లా డుతూ జగన్నాథస్వామి వైభవం, కలియుగంలో హరిహర సంకీర్తన ప్రాముఖ్యత, సంగారెడ్డిలో జరుగుతున్న భగవత్‌గీత ప్రచారం వంటి విశేషాలను వివరించారు. నట్‌కట్ గోపాల్ మేళా ప్రదర్శన ద్వారా చిన్న పిల్లలకు వినోదభరిత ఆటల పోటీలు నిర్వహించారు. ఈ రథయాత్రలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి పాల్గొని ఆశీర్వచనం పొందారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తి యోగా సెంటర్ కో ఆర్డినేటర్ గజేంద్రనాథ్, హలధర ప్రేమదాస్, ప్రేమ్ మహిమదాస్, నీతినిపుణ్‌దాస్, రాధాకృష్ణ, అరుణ్, సతీశ్, ప్రవీణ్, మురళీకృష్ణ, కమలా, శ్యామల, రామభద్రరూప, కౌన్సిలర్లు మంజులతానాగరాజుగౌడ్, లాడెమనీలా మల్లేశం, భక్తులు తదితరులు పాల్గొన్నారు. బొల్లారం మున్సిపాలిటీలోని పూరీ జగన్నాథస్వామి ఆలయం వద్ద రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద జగన్నాథస్వామి, సుభద్ర, బలరాములను రథోత్సవంలో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మున్సి పల్ కౌన్సిలర్లు, ఒడిస్సా రాష్ట్ర వాసులు హాజరయ్యారు. ఒడిస్సా సంక్షేమ సంఘం, ఆలయ నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపారు.

సిద్దిపేటలో త్వరలో జాతీయ గర్ల్స్ ఫుట్‌బాల్ క్యాంప్

- ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ

సిద్దిపేట క్రైం, జూలై 7: సిద్దిపేటలో త్వరలో జాతీయ గర్ల్స్ ఫుట్‌బాల్ క్యాంప్‌ను నిర్వహిస్తామని ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ సభ్యులు, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ అన్నారు. గోల్డె న్ బ్యాంక్వెట్ హాల్‌లో సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్య వర్గ ఎన్నికలు ఆదివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా, ముఖ్యఅతిథిగా ఫాల్గుణ హాజరయ్యారు. సిద్దిపేట జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంగారి గణేష్, ప్రధాన కార్యద ర్శిగా అక్బర్ నవాబ్, ఉపాధ్యక్షులుగా సుగుణకర్‌రెడ్డి, హరీశ్‌గౌడ్, నగేష్ జాయింట్ సెక్రటరీలుగా రాంగారి నర్సింహులు, ట్రెజరర్‌గా మాజిన్, ఎగ్జి క్యూటివ్ మెంబర్స్‌గా లక్ష్మీనారాయణరెడ్డి, చక్రపాణిగౌడ్, సాజిద్‌పాషా, గోవర్ధన్‌రెడ్డి, అజర్‌పాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఫాల్గుణ మాట్లాడుతూ ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీకి శుభా కాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు వచ్చేలా కృషి చేయాలన్నారు. సిద్దిపేట జిల్లాలో అద్భుత మైన వనరులు ఉన్నాయని, వాటిని సరైన పద్ధతిలో వినియోగించుకుని ముందుకు వెళ్లాలని, అన్నివిధాలుగా మీకు అండగా ఉంటానని పేర్కొ న్నారు. 15 నుంచి 29వ తేదీవరకు సిద్దిపేటలో జాతీయ జూనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ క్యాంప్ నిర్వహిస్తామని, ఇందులో ఎంపికైన క్రీడాకారులు కర్ణా టకలోని బెల్గావిలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరాం పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా ఫుట్‌బాల్ క్లబ్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఫాల్గుణ



శాకాంబరి రూపంలో వనదుర్గా మాత



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

శాకాంబరి రూపంలో దుర్గామాత

● రకరకాల కూరగాయలతో అమ్మవారి అలంకరణ ● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

పాపన్నపేట, జూలై 7: ఆషాఢమాసం మొదటి ఆదివారాన్ని పురస్క రించుకుని ఏడుపాయల వన దుర్గామాతను రకరకాల కూరగాయలతో శాకాంబరి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామునే వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున ఏడుపాయలకు తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నా నాలు ఆచరించి దుర్గామాతకు మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏడుపాయల ఆలయ చైర్మన్ సతెల్లి బాలాగౌడ్, ఆలయ ఈవో కృష్ణప్ర సాద్, ఆలయ సిబ్బంది రవివీర్ కుమార్, సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహులు, వరుణాచారి, బత్తిని రాజు, యాదగిరి, శ్రీకాంత్ ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థీవశర్మ, ముర ళీధర్, రాజశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపన్నపేట ఎస్ఐ నరేష్ తగిన బందోబస్తు చేపట్టారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మిరుదొడ్డి, జూలై 7: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మిరుదొడ్డి మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం... మిరుదొడ్డి గ్రామానికి చెందిన దర్మారం కనకయ్య(49)కు ఇద్దరు సంతానం. రెండు నెలల క్రితం కూతురు దీపిక వివాహం చేశాడు. పెళ్లయిన రెండు నెలలకే భర్తతో విభేదాల కారణంగా కూతురు విడాకులు తీసుకున్నది. దీంతో మనస్తాపానికి గురైన కనకయ్య ఎస్సీ హాస్టల్ వెనక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి...



చంద్రయ్య (ఫైల్)

మిరుదొడ్డి, జూలై 7:చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన సంఘటన మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో ఆది వారం చోటు చేసుకున్నది. ఎస్ఐ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రయ్య(68) గ్రామంలోని చెరు వులో చేపల వేటకు వెళ్లాడు. వల వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుకు చుట్టుకోవడంతో నీట మునిగి మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుం బసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బందం చెరువులో మునిగి వృద్ధుడి మృతి

- వర్గల్ మండలం చౌదరిపల్లిలో ఘటన

వర్గల్, జూలై 7: ప్రమాదవశాత్తు వృద్ధుడు చెరువులో మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గౌరారం ఎస్ఐ శివకుమార్ వివరాల ప్రకారం.. వర్గల్ మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన బండి సాయిలు(65)కు భార్య ముత్యాలు, కుమారుడు రమేష్ ఉన్నాడు. ఈనెల 4న రాత్రి కుటుంబసభ్యు లంతా నిద్రపోయారు. మరునటిరోజు ఉదయం చూసేసరికి సాయిలు కనిపించలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించ లేదు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని బందం చెరువులో సాయిలు శవమై కనిపించాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడని మృతుడి కుమారుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కొండపాక, జూలై 7: కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామంలోని 1061 సర్వే నంబర్‌లో 135 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో కొంతమందికి ప్రభుత్వం భూమి పంపిణీ చేసింది. మిగతాది కబ్జాకు గురైంది. ఈ విషయాన్ని మాజీ ఎంపీ టీసీ యాదగిరి అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన అధికారులు సర్వే చేయించి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. సుమారు 35 ఎకరాల భూమి ఉన్నట్టుగా తేలడంతో స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామ అవసరాల కోసం ఆ భూమిని ఉపయోగించుకోవడం కోసం గ్రామస్థులంతా కలిసి నిర్ణయించుకుంటామని యాదగిరి తెలిపాడు.

శ్రీరామాంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో డీఎస్‌వో తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మర్కుక్, జూలై 7: మర్కుక్‌లోని శ్రీరామాంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయ్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం ఆక స్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని రికార్డులను పరిశీలించి, స్టాక్ వివరాలను మిల్లు యజమాని బాలనారాయణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంగారెడ్డి డీఎ స్‌వో వనజాత మాట్లాడుతూ ఈ మధ్య సివిల్ సప్లయ్ విషయంలో భారీగా అవకత వకలు జరుగుతుండడంతో సిద్దిపేట జిల్లాలోని మూడు ప్రధాన మిల్లుల్లో ఏకకా లంలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. స్టాక్, రికార్డు వివరాలు సరిగ్గానే ఉన్నా యని నిర్ధారించారు. వారితో ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణ, ఇన్‌చా ర్జి తహసీల్దార్ ఆరిఫా, ఆర్ఐ నర్సింహులు, మిల్లు నిర్వాహకుడు కృష్ణమూర్తి ఉన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తులరద్దీ



రాజగోపుర ఆవరణలో భక్తజనసందోహం

చేర్యాల, జూలై 7: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులు తలనీలాలు సమర్పించి కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండపంలో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడి బియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడి బియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత దర్శదర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో దర్శనానికి గంటన్నర సమయం పట్టింది.

సెల్‌ఫోన్ అందజేత

జగదేవ్‌పూర్, జూలై 7: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను జగదేవ్‌పూర్ పోలీసులు సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితుడికి ఆదివారం ఎస్ఐ చంద్రమోహన్ అందించారు. తిగుల్‌కు చెందిన స్వర్గం పరుశురాములు కొద్ది రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ ద్వారా ఫోన్ గుర్తించి అందజేశారు.

బస్టాండ్ నిర్మాణం పూర్తయ్యేనా!?

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మలమూత్ర విసర్జనకు తప్పని తిప్పలు
- బిల్లులు మంజూరై, నిర్మాణం పూర్తయితేనే శాశ్వత పరిష్కారం

గజ్వేల్, జూలై 7: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇలాకాలో బస్టాండ్ సమస్యలు కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్న గజ్వేల్ పట్టణంలో నిర్మిస్తున్న బస్టాండ్‌కు అది నుంచి కష్టాలే ఎదురవుతున్నాయి. ఏళ్లుగా ఈ సమస్యకు పరిష్కారం దక్కకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బిల్లులు రాక పనులు ఆపిన కాంట్రాక్టర్

సమీకృత మార్కెట్ ఎదుట రోడ్డుపై తాత్కాలిక షెడ్‌ను ఏర్పాటు చేసి బస్టాండ్‌ను ఏర్పాటు చేయడంతో బస్సులు రోడ్డుపైనే నిలుస్తున్నాయి. 2016లో మొదలైన సమస్య ఎనిమిదేళ్లుగా తీరడం లేదు. నిధుల లేమీ కారణంగా బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి చేయలేకపోతున్నారు. ఏడాది క్రితం బస్టాండ్ నిర్మాణం చేపట్టగా జీప్లస్‌వన్ పద్ధతిలో స్లాబ్ వరకు పనులు పూర్తి చేశారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు.



గజ్వేల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న బస్టాండ్



గజ్వేల్ పట్టణంలో రోడ్డుపై నిలిపిన బస్సులు

ప్రయాణికులకు తిప్పలు

బస్టాండ్ నిర్మాణంలో ఉండడంతో నిత్యం ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైన తాత్కాలిక షెడ్ ఏర్పాటు బస్సులు నిలుపుతుండడం, బస్సుల చుట్టూ ఆటోలు గుమిగూడుతుండడంతో ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయి.

సమీకృత మార్కెట్‌లో..

గజ్వేల్ పట్టణంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సమీకృత మార్కెట్‌లోని దక్షిణ భాగంలో ఉన్న పార్కింగ్ స్థలంలో బస్సులు నిలపడానికి అనుమతి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి కోరారు. వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయిని మార్కెట్‌ను పరిశీలించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో సమీకృత మార్కెట్‌ను పరిశీలించిన ఆమె సమీకృత మార్కెట్‌లో బస్సుల నిలుపుదల గల అవకాశాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దాదాపు పదిహేను రోజులు కావస్తున్నా ఎలాంటి నిర్ణయం వెలువరించకపోవడంతో సందిగ్ధత నెలకొన్నది. ప్రస్తుతం ఉన్న సమీకృత మార్కెట్‌ను కదిలించకుండా బిల్లులు రాక నిలిచిపోయిన బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి ప్రజలు కోరుతున్నారు.

వీఆర్‌ఏల వారసులకు న్యాయం చేయాలి

- వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నరాజలింగం

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 7: 61 ఏళ్ల పైబడిన రెవెన్యూ వీఆర్‌ఏల వారసులకు ప్రభుత్వం న్యాయం చేయాలని వీఆర్‌ఏల జిల్లా అధ్యక్షుడు గుడుమల్ల రాజలింగం కోరారు. 61 ఏళ్ల గ్రామ రెవెన్యూ సహాయకులు ఆదివారం సిద్దిపేటలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుమల్ల రాజలింగం మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 20,555 మంది వీఆర్‌ఏలు ఉన్నారని, అందులో జీవో నెంబర్ 81, 85ల ప్రకారం 16,758 మందిని రెగ్యులర్ చేసి గత ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించిందని పేర్కొన్నారు. మిగిలిన 61 సంవత్సరాలు దాటిన 3,797 మంది వీఆర్‌ఏల వారసులకు కూడా ఉద్యోగాలు ఇవ్వాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. సంవత్సర కాలం గడిచినప్పటికీ ఇప్పటి వరకు 61 సంవత్సరాలు దాటిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్‌ఏల వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా వివిధ మండలాల గ్రామ రెవెన్యూ సహాయకులు బక్కి నర్సింహులు, రాజు, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, బిక్షపతి, సత్యం, శ్యామ్, వెంకటయ్య, నాగరాజు, కనకయ్య, లక్ష్మీనరసింహులు, సంపత్, ప్రవీణ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

12న గాయకులకు ఉద్యమ గాన కోకిల బిరుదు ప్రదానం

హుస్నాబాద్, జూలై 7: ఈ నెల 12వ తేదీన కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఉత్తర తెలంగాణలో లబ్ధప్రతిష్ఠులైన 40 మంది ఉద్యమ గాయకులకు, ఉద్యమ గానకోకిల బిరుదును ప్రదానం చేస్తున్నట్లు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్‌కుమార్‌లు తెలిపారు.

మానవత్వం చాటిన స్నేహితులు

మర్కుక్, జూలై 7: మండల పరిధిలోని యూసఫ్‌ఖాన్‌పల్లికి చెందిన టూవీలర్ మెకానిక్ జంగిటి నవీన్(25) నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తోటి మెకానిక్ స్నేహితులు అతడి కూతురు అక్షర పేరు మీద రూ.51,450లు ఎల్ఐసీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్‌ను ఆదివారం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మర్కుక్ మండల మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాజు, ఉపాధ్యాయుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గణేష్, కోశాధికారి నరేష్, సహాయ కార్యదర్శి ఆనంద్‌యాదవ్, యూనియన్ సభ్యులు మహేశ్ బాబు, గోపి, సాజిద్, రమేష్, నరేష్, బాబు, సిద్దు, అనంద్, సురేష్, వినోద్, మహేశ్, యాదగిరి, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నాయకుల వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేర్యాల, జూలై 7: సిద్దిపేట-గురువన్నపేట నడుమ కొన్నాళ్ల క్రితం నిలిపివేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ కొమురవెల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, ఐనాపూర్ మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి, నాయకులు మల్లం బాలయ్య, కాయిత శ్రీనాథ్‌రెడ్డి, రాజు, మల్లయ్య, మోహన్‌రెడ్డి, కనకరాజు పాల్గొన్నారు.

'పోలీసుశాఖలో కులవివక్ష సిగ్గుచేటు'

గజ్వేల్, జూలై 7: అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడైన సీఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ అండగా ఉండాల్సిన పోలీస్ వ్యవస్థలో కూడా కుల పిశాచి పంజా విసరడం దారుణమన్నారు. ఈ కేసును పారదర్శకంగా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో దళిత, సామాజిక, కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కౌన్సెలింగ్‌కు 425 మంది హాజరు

నంగునూరు, జూలై 7: ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం మండలంలోని రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కాలేజీలో రెండో రోజు ఆదివారం 500 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలను హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది నితిన్ పవర్, మాణిక్యం, సీహెచ్ శ్రీనివాస్, రాజు, విజయ్‌కుమార్ శ్రీనివాస్, రాజమౌళి, స్వామి, శ్యామ్, సంధ్యరాణి, కవిత, జ్యోతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు మండల జర్నలిస్టుల యూనియన్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన యూనియన్ సభ్యులు

చిన్నకోడూరు, జూలై 7: చిన్నకోడూరు మండల జర్నలిస్టుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని మండలంలోని పెద్దకోడూరులో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా తుమ్మల తిరుపతి, ఉపాధ్యక్షుడిగా నిరుగొండ జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా పుప్పాల బాలేష్, కార్యదర్శిగా మిట్టపల్లి భరత్, కోశాధికారిగా గాజుల రవి, సలహాదారులుగా మిట్టపల్లి శ్రీనివాస్, బోయిని మధు, కోడి లక్ష్మణ్, గూడ ఇంద్రసేనారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సుంచు మహేష్, గోవిందారపు యాదగిరి, బుచ్చెల్లి రవి, పోతరాజు శంకర్, సుంచు గణేష్, గొల్లపల్లి మధు, మాతంగి రంగరాజు, గుడిసె ప్రభు తదితరులు ఎన్నికయ్యారు.

శేరిపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన

చేంగుంట, జూలై 7: నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో శనివారం రాత్రి సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్ఐ మోహియుద్దీన్ ఆధ్వర్యంలో కళాబృందంచే ప్రజలకు నేరాలు, మహిళల రక్షణపై పలు సూచనలు చేస్తూ, అవగాహన కల్పించారు. మహిళల అక్రమ రవాణ, బాల్య వివాహాలు, బాలలపై దాడులు, అలాగే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

బిల్లులు రావు.. పనులు ముందుకు సాగవు

- నిలిచిన ఆరోగ్య ఉపకేంద్రాల పనులు



ఇర్కోడులో స్లాబ్ స్థాయిలోనే నిలిచిపోయిన ఆరోగ్య ఉపకేంద్రం పనులు

నారాయణరావుపేట, జూలై7: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను ఏడాది క్రితం, ఎమ్మెల్యే హరీశ్‌రావు నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద నాలుగు ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ. 20 లక్షల నిధులు మంజూరు చేయించారు. రాఘవాపూర్, చిన్న గుండవెల్లి, ఇర్కోడు గ్రామాల్లో పనులు ప్రారంభించినప్పటికీ, నారాయణరావుపేట మండల కేంద్రంలో స్థలం సేకరణ చేయకపోవడంతో పనులు చేపట్టలేదు. నిబంధనల ప్రకారం పనులు జరిగే కొద్ది బిల్లులు విడుదల చేయాలి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో ఆయా గ్రామాల్లో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అర్థాంతరంగా నిలిచిపోయిన పనులు

ఆరోగ్య ఉపకేంద్రాలు నిర్మించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మంజూరు చేసిన నిధులు సకాలంలో రాకపోవడంతో ఇర్కోడులో ఆరోగ్య ఉపకేంద్ర భవనం స్లాబ్ స్థాయిలోనే నిలిచిపోయింది. ఆ పనులు ఆగిపోయి ఏడాది కావస్తున్నా అధికారులు, స్థానిక నాయకులు స్పందించకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చిన్నగుండవెల్లిలో నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ డ్రైనేజీ, సీటీ సౌకర్యం పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో అరకొర వసతులతో ఉన్న తాత్కాలిక భవనాల్లోనే ఆరోగ్య ఉపకేంద్రాలను నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటి పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'ఉన్నత శిఖరాలను అధిరోహించాలి'

దుబ్బాక, జూలై 7: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరుప్రతిష్ఠలు వస్తాయని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. దుబ్బాకలో సీసీఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో ట్రిబుల్‌ఐటీలో సీట్లు సాధించిన స్థానిక విద్యార్థులను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్, శ్రీనివాస్, రవి, శ్రీనివాస్, రాజిరెడ్డి, దేవేందర్, సురేష్, రాజిరెడ్డి, చంద్రారెడ్డి, గోపి తదితరులున్నారు.

మాజీ జడ్పీటీసీకి సన్మానం



మాజీ జడ్పీటీసీని సన్మానిస్తున్న నాయకులు

హుస్నాబాద్, జూలై 7: ఇటీవల పదవి విరమణ చేసిన అక్కన్నపేట జడ్పీటీసీ భూక్య మంగ శ్రీను దంపతులను ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో గిరిజన సంఘాల నాయకులు సన్మానించారు. భూక్య మంగ అక్కన్నపేట జడ్పీటీసీగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి పనులు చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాంచంద్రంనాయక్, గిరిజన సంఘాల నాయకులు సత్యంనాయక్, తిరుపతినాయక్, రాజునాయక్, మోహన్‌నాయక్, బోడ రవి, రమేశ్‌నాయక్ తదితరులున్నారు.

హుస్నాబాద్ కోర్టు ఏజీపీగా సదానందం

హుస్నాబాద్, జూలై 7: హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా పట్టణానికి చెందిన న్యాయవాది ఒగ్గోజు సదానందంను నియమిస్తూ శనివారం జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. సదానందం 10 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి జూనియర్ సివిల్ జడ్జి కోర్టుతో పాటు అదనపు కోర్టుకు లీగల్‌ఎయిడ్ అడ్వకేట్‌గా పని చేస్తున్నారు.

హుస్నాబాద్‌లో కొవ్వొత్తులతో నివాళి

హుస్నాబాద్ టౌన్, జూలై 7: తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేయడం పట్ల శనివారం రాత్రి హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆయన హత్యకు కారకులైన వారిని గుర్తించి ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి వచ్చిమట్ల రవీందర్‌గౌడ్, జిల్లా నాయకులు డేగల వెంకటేశ్వర్లు, సుదాకర్, ఎలగందుల శంకర్, నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు, శరత్, జేరిపోతుల రవీందర్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



భూమిపూజ చేస్తున్న నర్సారెడ్డి

ములుగు, జూలై 7: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తునికి బొల్లారంలో ఆదివారం రూ. 5 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నదని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏకాంబరెడ్డి, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

- సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాలనర్సయ్య



రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

కొండపాక, జూలై 7: అర్థాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాల నర్సయ్య డిమాండ్ చేశారు. సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్డు పనులు మండలంలోని బందారంలో మధ్యలోనే నిలిచిపోయాయి. గ్రామస్తులు ఇబ్బంది పడుతుండడంతో సీపీఎం నాయకులు ఆదివారం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు వదిలిపెట్టి వెళ్లాడని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొమురయ్య, మల్లేశం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి ఫ్యాన్లు, లైట్ల అందజేత

హుస్నాబాద్, జూలై 7: హుస్నాబాద్ పట్టణం 19వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రానికి కొంత మంది ఆర్టీసీ సిబ్బంది సేవాభావంతో విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాట్లు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సదుపాయం లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని టీచర్ సునిత పలువురి దృష్టికి తీసుకురాగా స్పందించిన హుస్నాబాద్ ఆర్టీసీ సిబ్బంది సీహెచ్ ఎల్లయ్య, ఎ శ్రీనివాస్, జి మల్లేశం, సీహెచ్‌టీ రెడ్డి, జీవిరెడ్డి, జేకేరావు, పీ వినోద్‌కుమార్, ఎండీ నూరి పర్విన్‌తో పాటు ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగయ్యలు విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు.

'మట్టి స్నానంతో మహా ఆరోగ్యం'



మట్టి స్నానం చేసిన యోగా గురువులు, పలువురు

సిద్దిపేట క్రైం, జూలై 7: మట్టి స్నానం మహా ఆరోగ్యం అని ఆచార్యులు యోగా వంశీకృష్ణ అన్నారు. ఆది యోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో యోగా గురువులు బొజ్జ అశోక్, ఎలిగేటి కృష్ణమూర్తి, పెద్ది మనోహర్ ఆధ్వర్యంలో మట్టి స్నానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారితో మొదట సూక్ష్మ యోగా ఆసనాల సాధన చేయిస్తూ ఉపయోగాలను వివరించారు. మట్టి స్నానం వల్ల కలిగే ఉపయోగాలను బోధించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో మట్టి స్నానం చేయించారు. ఈ సందర్భంగా ఆదియోగి పరమేశ్వర యోగ ఫౌండేషన్ ఆచార్యులు యోగా వంశీకృష్ణ మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి మట్టి స్నానం ఆచరించే వారన్నారు. ఆదియోగి పరమేశ్వర యోగ ఫౌండేషన్ వ్యవస్థాపకుల సిద్ది రాములు, తుల్జాపూర్ వినోద్ ప్రతి నెల మట్టి స్నానం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యోగా గురువు మట్టి స్నాన నిపుణులు గురూజీ, శ్రీనివాస్, ప్రభుదాస్, కడవేర్గు రమేశ్ బాబు, కత్తుల బాపురెడ్డి, జూలూరి రవికుమార్, దేవేందర్‌గౌడ్, సముద్రాల శ్రీనివాస్, చింతల శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, రామచంద్రం, కూతురు రాజిరెడ్డి, శ్రీనివాసచారి, నాయిని సంజీవరెడ్డి, శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రం, రాము పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్రపౌర గ్రంథాలయాల సంచాలకులు ఏవీఎన్ రాజు

గజ్వేల్/ములుగు, జూలై 7: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకులు ఏవీఎన్ రాజు అన్నారు. గజ్వేల్‌శాఖ గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. ప్రతీరోజు ఎంతమంది పాఠకులు వస్తున్నారని లైబ్రేరియన్ కొన్యాల తిరుపతిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం గ్రంథాలయాను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రపౌర గ్రంథాలయల సంచాలకులు ఏవీఎస్ రాజు అన్నారు. ఆదివారం ములుగు శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ములుగు లైబ్రేరియన్ సబిత ఉన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

హుస్నాబాద్, జూలై 7: హుస్నాబాద్ పట్టణంలోని గ్రంథాలయానికి ఆదివారం పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ పుస్తకాలు వితరణ చేశారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు తమకు వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఏర్పాటు చేయాలని హుస్నాబాద్ పట్టణానికి చెందిన పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌ను కోరారు. వెంటనే స్పందించి సంబంధిత పుస్తకాలను ఆయన స్నేహితుల ద్వారా గ్రంథాలయానికి పంపించారు. కార్యక్రమంలో కొండూరి శ్రీనివాస్, కొత్తపల్లి అశోక్, వీ. వెంకటరమణారెడ్డి, కన్నోజు శ్రీనివాస్, సుంకె జగన్, రాజ బ్రహ్మాచారి, కరణ్‌లున్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

దూళిమిట్ట, జూలై 7: మండలంలోని బైరాన్‌పల్లిలో చారిత్రక నేపథ్యం ఉన్న బురుజు వద్ద ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ బయోడీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సంస్థ జాతీయ అధ్యక్షుడు లింగంపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచిత పోరాటం చేసి వీరమరణం పొందిన బైరాన్‌పల్లి అమరుల స్ఫూర్తిగా, అణగారిన వర్గాలకు విద్యను అందించడానికి ఎంతో కృషి చేసిన మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని, ఆగస్టు 27న బైరాన్‌పల్లి అమరుల సంస్మరణ దినోత్సవం నాడు మంత్రి సీతక్క చేతుల మీదుగా విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య, మాజీ సర్పంచులు శ్రీనివాస్, చంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్లేశం, ఉపేందర్, నాగభూషణం, బిక్షపతి పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

టేక్మాల్, జూలై 7: టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బొడ్మాట్‌పల్లి గ్రామ శివారులోని 161 జాతీయ రహదారిపై ఆదివారం ఓ వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కడిలాబాయి తండాకు చెందిన లడికిబాయి (50) గ్రామంలో పనులు లేకపోవడంతో బొడ్మాట్‌పల్లి గ్రామానికి కూలి పని నిమిత్తం వచ్చింది. రోడ్డు దాటుతున్న క్రమంలో టీస్ 07ఈక్యూ 7218 వాహనం ఢీకొంది. చుట్టు పక్కల వారు గమనించి వెళ్లేసరికి అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎస్ఐ మురళి సంఘటన స్థలానికి చేరుకొని మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'మై ఆటో' స్టిక్కర్ తప్పనిసరి

జహీరాబాద్, జూలై 7: ఆటో డ్రైవర్లు తమ ఆటోలపై మై ఆటో స్టిక్కర్లు తప్పనిసరిగా వేసుకోవాలని జహీరాబాద్ పట్టణ సీఐ రాజబోయిన రవి పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంతోపాటు, మండలపరిధిలోని చిరాగ్‌పల్లి, కోహీర్, జహీరాబాద్ రూరల్ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి స్టిక్కర్ లేని 260 ఆటోలను గుర్తించామన్నారు. వాటన్నింటికి స్టిక్కర్లు వేసుకోవాలని ఆయా ఆటోలకు చెందిన డ్రైవర్లను ఆదేశించామన్నారు. స్టిక్కర్లు వేసుకోని ఆటోల డ్రైవర్లు వారి వారి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో పోలీసులను సంప్రదించి వేయించుకోవాలన్నారు. మై ఆటో స్టిక్కర్‌ను ఆటోపై వేయడం మూలంగా ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు ప్రయోజనకరంగా ఉండడంతోపాటు ప్రమాదాలను త్వరితగతిన చేదించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఆటోల డ్రైవర్లు గమనించి పోలీసుల సలహాలు, సూచనలను పాటిస్తూ తమకు సహకరించాలని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు లక్ష్మారెడ్డి, ప్రసాదరావు, నరేష్, క్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణపై బీజేపీ చిత్తశుద్ధి చాటుకోవాలి

- ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

చేర్యాల, జూలై 7: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ఇచ్చిన హామీని నెరవేర్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చేర్యాల మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నా పాలకులు గుర్తించక పోవడం శోచనీయమన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాదీక్షకు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు మల్లిగారి శ్రీనివాస్, మల్లిగారి బాబు, నరేశ్, గణేశ్, ఏలూరి కృష్ణ, రాజయ్య, నాగరాజు, తిరుపతి, విజయ్, బాబు, లోకేశ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

- **దూళిమిట్ట:** మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సుందరగిరి భాస్కర్ మాట్లాడుతూ.. ఎబీసీడీ వర్గీకరణ కోసం, హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల క్రితం ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి అణగారిన వర్గాల కోసం అనేక ఉద్యమాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కనకస్వామి, ఎల్లయ్య, కనకయ్య, ప్రశాంత్, బాబు, సాయిలుగౌడ్, మహేష్, బాలయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.



దూళిమిట్ట: జెండాను ఎగురవేసి మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- **చిన్నకోడూరు:** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం చిన్నకోడూరు మండల కేంద్రంలో ఆ పార్టీ జెండాను ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు జేరిపోతుల లక్ష్మణ్, మాణిక్యం ఎమ్మార్పీఎస్ నాయకులు కనకయ్య, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- **గజ్వేల్:** మాదిగల గుండె చప్పుడు మంద కృష్ణ అని ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు పైన రాములు అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు ఉబ్బని అంజనేయులు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. దండోరా ఉద్యమం కోట్లాది మంది మాదిగలకు ఆత్మగౌరవాన్ని తీసుకొచ్చిందని, లక్షలాది మంది దివ్యాంగులకు పెన్షన్ సాధించి పెట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బెజగాం యాదగిరి, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు జాలని బలరాం, గద్దల సుధాకర్, ఎమ్మార్పీస్ జగదేవ్‌పూర్ మండల ఇన్‌చార్జి బొమ్మని మహేష్, మాసాన్‌పల్లి అశోక్, మోచి రవి, మోచి ప్రభాకర్, సురేందర్, యాదగిరి, బుర్కి ప్రశాంత్ పాల్గొన్నారు.